క్లుప్తంగా

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజా

హిందూపురం టౌన్: రాష్ట్రంలోని 2.60 లక్షల మంది వలంటీర్లకు న్యాయం చేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కాలనీలో ఏఐవైఎఫ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లో కొనసాగించాలని, ఎన్నికల హామీ ప్రకారం వలంటీర్లకు రూ.10 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, బకాయి పడిన 4 నెలల గౌరవ వేతనాన్ని తక్షణమే చెల్లించాలన్నారు. సీఎం చంద్రబాబు స్పందించి వలంటీర్లకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఉద్యమబాట పడతామన్నారు. కార్యక్రమంలో సమీవుల్లా, కమల్ బాష, నౌషద్, జిలాన్, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి విగ్రహ పునఃప్రతిష్ట



పునఃప్రతిష్టాపనలో పాల్గొన్న రఘువీరారెడ్డి

మడకశిర: పట్టణంలో శుక్రవారం వేణుగోపాల స్వామి విగ్రహ పునః ప్రాతిష్టాపన శుక్రవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దంపతులు, యాదవ సంఘం నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.

అయ్యప్పస్వామి విగ్రహ ఊరేగింపు



ముద్దిరెడ్డిపల్లిలో విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం ముదిరెడ్డిపల్లిలో అయ్యప్ప స్వామి ఆలయం పునర్నిర్మాణం చేపట్టడానికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ముదిరెడ్డిపల్లిలో ఆలయ మూలవిరాట్ స్వామి పంచలోహ విగ్రహాలు, గోపురం స్తూపాలను శుక్రవారం ఊరేగించారు. ఈనెల 14న అయ్యప్ప మూలవిరాట్ నూతన పంచలోహ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం చేపడుతున్నట్లు గురుస్వాములు ఆంజనేయులు, పల్లా లక్ష్మీకుమార్, మంజునాథ్, చంద్రమోహన్ తెలిపారు. భక్తులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని వారు కోరారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా షేక్షావలి



రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా షేక్షావలి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కలెక్టరేట్‌లో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. భూ సమస్యలు ఏమైనా ఉంటే రైతులు నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కంటి చికిత్స శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

పావగడ: బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రి, హెల్ప్ సొసైటీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రి లో శుక్రవారం ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు నిర్వహించగా.. 60 మంది శస్త్రచికిత్సకు ఎంపికయ్యారు. వారిని బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో నిర్వాహకులు విద్యాసాగర్, మానం శశికిరణ్, వైద్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అమ్మకు గౌరవం ఏదీ?







మాతాశిశు కేంద్రం వద్ద రద్దీగా ఉన్న ఓపీ , జనాలు అధికంగా ఉన్నప్పటికి అక్కడే పిల్లర్‌కు అటువైపు కూర్చొని పాలిస్తున్న తల్లులు

- బిడ్డలకు పాలిచ్చేందుకు తల్లుల అవస్థలు
- కలెక్టర్ ఆదేశించినా స్పందించని అధికారులు

హిందూపురం టౌన్: బిడ్డకు పాలివ్వడాన్ని తల్లి గొప్ప అనుభూతిగా భావిస్తుంది. అయితే ఇక్కడ పాలివ్వాలంటే తల్లులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ఇలాంటి పరిస్థితులుంటే ఇక బయట రద్దీగా ఉండే ప్రాంతాల్లో బిడ్డలకు పాలివ్వడానికి తల్లులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

మహిళలకు సౌకర్యాల కొరత

హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి నిత్యం వందలాది మంది రోగులు వైద్యం కోసం వస్తుంటారు. రోజూ ఓపీ దాదాపుగా వెయ్యి వరకూ ఉంటుంది. వీరిలో 500 మందికి పైగా తల్లులు, బాలింతలు తమ పిల్లలతో మాతాశిశు కేంద్రానికి వైద్యం కోసం వస్తుంటారు. ఇక్కడ ఓపీకి పెద్ద క్యూ ఉంటుంది. అయితే ఇక్కడ పిల్లలతో వచ్చే మహిళలకు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఓపీ వద్ద క్యూలో ఎక్కువ మంది పురుషులు ఉంటారు. భర్త ముందు భార్య తన పిల్లలకు పాలివ్వాలంటేనే కొంచెం సిగ్గుతో కొంగును అడ్డం పెట్టుకుని మరి ఇస్తుంది. కానీ ప్రభుత్వాస్పత్రిలో అందరి ముందు తల్లి పాలివ్వాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలకు ఆకలి వేసినప్పుడు తల్లులు పాలివ్వడానికి కూడా ఇక్కడ కనీస సౌకర్యాలు లేకుండా పోయాయి. ఓపీ క్యూ వద్దే గోడ చాటున, పిల్లర్ చాటున కూర్చొని ఇబ్బందికర పరిస్థితుల్లోనే తల్లులు పాలిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తల్లి పాలిస్తున్నప్పుడు ఎవరో ఒకరు వారి బంధువులు అడ్డంగా నిలబడాల్సి వస్తోంది. ఆస్పత్రిలో ప్రత్యేక గదులు ఉన్నాయని వైద్యులు చెబుతున్నప్పటికీ.. అవి ఎక్కడ ఉన్నాయో కనిపించవు. ఓపీ వద్దకు వచ్చే తల్లుల కోసం ప్రత్యేకంగా ఫీడింగ్ స్థలం ఏర్పాటు చేయాలని తల్లులు కోరుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్!

గత నెల 26న కలెక్టర్ చేతన్ హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన ఆస్పత్రిని పరిశీలించారు. మాతాశిశు కేంద్రం ఓపీ వద్ద కూర్చొని కొందరు తల్లులు పాలివ్వడాన్ని ఆయన గమనించారు. అలాగే పలువురు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్ వెంటనే ఓపీ వద్ద తల్లులు పాలివ్వడానికి పరదాలు వేసి స్థలం కేటాయించాలని ఆదేశించారు. అయితే దీనిని ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కలెక్టర్ ఆదేశాలను సైతం బేఖాతర్ చేశారు. ఆస్పత్రిలో తల్లులు పాలివ్వడానికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ చూపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిడ్డకు పాలివ్వడానికి ఇబ్బంది పడ్డాను

సంవత్సరం వయసున్న బాబుకు ఆరోగ్యం సరిగా లేక హిందూపురం జిల్లా ప్రభుత్వాస్పత్రికి ఈ వారంలోనే రెండు సార్లు వచ్చాను. క్యూలో ఎక్కువ సేపు నిలబడడంతో బాబు ఏడుపు మొదలుపెట్టాడు. బిడ్డకు పాలిచ్చేందుకు చుట్టుక్కల ఎక్కడ చూసినా స్థలం లేదు. చుట్టూ చాలా మంది పురుషులు ఉన్నారు. బిడ్డ ఏడుపు ఎక్కువ కావడంతో అక్కడే పిల్లర్ వద్ద అటుపక్కకు కూర్చొని బిడ్డకు పాలిచ్చేందుకు ఎంతో ఇబ్బంది ఎదుర్కొన్నాను. ఆస్పత్రి అధికారులు స్పందించి మాలాంటి వారికి ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలి.

– జ్యోతి, హిందూపురం

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

గుడిబండ: మండల కేంద్రంలో బోయ కులస్తుల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని వివిధ రకాల పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. తొలుతగా మహిళలు నియమ నిష్టతో బియ్యం పండితో చేసిన జ్యోతులను గ్రామ మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి వాల్మీకి విగ్రహం వద్ద సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వాల్మీకులు స్థానిక పోలీస్ స్టేషన్ ప్రహరీ పక్కన నూతనంగా వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



భూమి పూజ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి జీబీ శివ కుమార్, సర్పంచ్ కరుణాకర్, అశ్వత్, నాయకులు రామాంజి, కర్ణ, వాల్మీకులు పాల్గొన్నారు.

పోటా పోటీగా పాల సంఘం ఎన్నికలు

పావగడ: జిల్లా పాల ఉత్పత్తి సహకార సంఘానికి సంబంధించిన పావగడ తాలూకా డైరెక్టర్ స్థానం ఎన్నికలు పోటా పోటీ గా సాగాయి. ఈ నెల 10 న తుమకూరులోని ఎంప్రెస్ కళాశాల లో జరిగే ఎన్నికల్లో స్థానిక డైరెక్టర్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ తరపున బెళ్ళిబట్లు చంద్రశేఖరరెడ్డి, బీజేపీ, జేడీఎస్ కూటమి అభ్యర్థిగా ప్రస్తుత తుముల్ డైరెక్టర్ చన్నమల్లయ్య తలపడుతున్నారు. మొత్తం ఈ ఎన్నికల్లో 47 పాల సంఘాలకు సంబంధించి 47 మంది ఓటర్లు ఉన్నారు. పాల సంఘం ఎన్నికల నిర్వహణ లో అపర చాణుక్యుడైన చన్న మల్లయ్య తన గెలుపు కోసం కావలసిన సంఖ్యాబలాన్ని ఇప్పటికే లోపాయికారిగా సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చంద్రశేఖరరెడ్డి సైతం



చన్నమల్లయ్య , చంద్ర శేఖరరెడ్డి

స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ అండదండలతో విజయం కోసం కావలసిన మెజార్టీని పదిల పరచుకున్నట్లు సమాచారం. ఎవరికి వారే తాము గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆదివారం జరిగే పోలింగ్ లో ఎవరిని అదృష్ట దేవత వరిస్తుందో ఎదురు చూడాల్సిందే.

కుక్కల దాడితో జనం బెంబేలు

లేపాక్షి: మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కలు బెడద ఉండడంతో ప్రయాణికులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కలు రోడ్లల్లో సంచరించడం వల్ల వాహనాలకు అడ్డంగా రావడం, వాటిని తప్పించడానికి వాహనదారులు ప్రయత్నించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. లేపాక్షి, కల్లూరు, బిసలమానేపల్లి, చోళసముద్రం, పూలకుంట, ప్రాంతాల్లో వాహనాలకు కుక్కలు అడ్డు రావడం అధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా లేపాక్షి దేవాలయం వద్ద కుక్కలు విపరీతంగా సంచరించడంతో యాత్రికులు భయాందోలన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



లేపాక్షి రోడ్లలో సంచరిస్తున్న కుక్కలు

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

లేపాక్షి: మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో శనివారం, ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఈ నెల 23, 24న కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని, ఈఆర్‌ఓ, ఏపీఆర్‌ఓలు పర్యవేక్షిస్తారన్నారు.

నేడు, రేపు ఓటరు జాబితా సవరణ

మడకశిర: మండలంలో శని, ఆదివారం ఓటరు జాబితాల సవరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తహసీల్దార్ కరుణాకర్ తెలిపారు. ఓటరు జాబితాల సవరణలో భాగంగా చేర్పులు, మార్పులు, తొలగింపులు చేస్తామని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండలంలోని బీఎల్‌ఓలు ఈరెండు రోజుల పాటు ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 10 నుం,ఇ సాయంకాలం 5 గంటలకు వరకు అందుబాటులో ఉండి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెనుకొండ రూరల్: ఓటరు నమోదును యువత సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్ సూచించారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు నమోదు, సవరణ చేయించుకోవచ్చన్నారు.

త్రిలింగ దర్శనానికి బస్ సౌకర్యం

పెనుకొండ: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి త్రిలింగ దర్శనానికి బస్ సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ రామసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు బస్సు బయలుదేరి బుగ్గ రామలింగేశ్వరస్వామి, యాగంటి, మహానంది దేవాలయాలను దర్శించుకుని రాత్రి పెనుకొండకు చేరుకుంటుందన్నారు. బస్ చార్జీ పెద్దలకు రూ.790, పిల్లలకు రూ.400 ఉంటుందన్నారు. వివరాలకు 7382862783, 7331140927 నంబర్లకు సంప్రదించాలన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోండి

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా నిర్వహించే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ జరిగింది. భూ సమస్యలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ పలువురు రెవెన్యూ అధికారులకు అర్జీలు అందజేశారు. పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

13న మడకశిర బంద్

మడకశిర: నియోజకవర్గంలోని ఆలయాలన్నింటినీ ఎండోమెంట్ పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ ఈనెల 13న మడకశిర బంద్‌ను నిర్వహించనున్నారు. ఈమేరకు లోక్ కల్యాణ్ ప్రజాసాక్షి సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయుడు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయాల్లో పని చేసే అర్చకులందరికీ ధూపదీప నైవేద్యం పథకం వర్తింపజేయాలని కోరారు. బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

21న సాగునీటి సంఘాల ఎన్నికలు

లేపాక్షి: మండల వ్యాప్తంగా 14 చెరువులకు సంబంధించి సాగునీటి సంఘాల ఎన్నికలు ఈనెల 21న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సాగునీటి సంఘాలకు ఆయకట్టు రైతుల ముసాయిదా జాబితాను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించామన్నారు. ఈ ముసాయిదా జాబితాను చూసుకుని అభ్యంతరాలుంటే ఈనెల 12లోపు తెలియజేయాలన్నారు.

కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో అమ్మవారు

గుడిబండ: జంబులబండ గ్రామంలో వెలసిన కొల్లాపురమ్మ ఆలయంలో కార్తీక మాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమ అర్చనలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి, బంగారు ఆభరణాలతో పాటు వివిధ రకాల పూలు, నిమ్మకాయలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఏఐటీయూసీ జిల్లా సదస్సు వాయిదా



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హిందూపురం టౌన్: పట్టణంలో ఈ నెల 10న జరగనున్న ఏఐటీయూసీ జిల్లా కార్మిక సదస్సును వాయిదా వేస్తున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రహమత్‌పురంలోని ఆటోయూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ పట్టణ కమిటీ సమావేశం పట్టణ కార్యదర్శి మారుతీరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సును కొన్ని అనివార్య కారణాలరీత్యా తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జబీవుల్లా, ఉపాధ్యక్షుడు సమీవుల్లా, కమల్ బాషా, సహాయ కార్యదర్శి నౌషద్, జమీర్, జిలాన్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

చిలమత్తూరు: మండలంలోని మరవకొత్తపల్లిలో పంచాయతీ బోరుకు సంబంధించిన కేబుల్ చోరీకి గురైంది. వారం కిందట గ్రామంలో ఉన్న బోరు మరమ్మతులకు గురవడంతో కేబుల్ బయటకు తీశారు. మరమ్మతులు చేయించడం ఆలస్యం కావడంతో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు రూ.10 వేలు విలువ చేసే కేబుల్ చోరీ చేశారు. కాగా ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

కంప చెట్లను తొలగించండి



మడకశిర చెరువు వద్ద రోడ్డుకు ఇరుపైపులా పెరిగిన కంప చెట్ల

మడకశిరరూరల్: మండలంలోని మడకశిర చెరువు వద్ద రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించి వాహనాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అటు వైపు నుంచి ట్రాక్టర్, ఇతర వాహనాలు వస్తే ఇటు వైపు నుంచి పోయే ఏ వాహనం అయినా సరే కంప చెట్ల వద్ద నిలిపి, ఆ వాహనం వెళ్లిన తర్వాత పోవాల్సి ఉంది. ఈ రోడ్డుపై మడకశిర, గుడిబండ మండలాల గ్రామాల ప్రజలు నిత్యం మడకశిర పట్టణానికి వస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కంప చెట్లను తొలగించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

పెనుకొండ రూరల్: రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శుక్రవారం మండల పరిధిలో మునిమడుగులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత కొంతకాలంగా రెవెన్యూ శాఖలో సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. సమస్యలను సత్వర పరిష్కరించేందుకు గ్రామాల్లోనే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పంచాయతీ వ్యాప్తంగా రెవెన్యూ, రేషన్ కార్డులు, పింఛన్లు, తదితర సమస్యలపై 142 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, తహసీల్దార్ శ్రీధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పెనుకొండ రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో రెవెన్యూ 215, ఫించన్లు 147, గృహ నిర్మాణాలు 96, ఇతరత్రా 15 ఫిర్యాదులు అందినట్లు ఆర్డీఓ కార్యాలయ డీటీ ప్రసాద్ తెలిపారు.

పలగలపల్లిలో గ్రామ సభ

చిలమత్తూరు: మండలంలోని పలగలపల్లిలో తహసీల్దార్ యూనిస్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ మేరకు ఆయన రైతులు, ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పెన్షన్లు – 20, హౌసింగ్ –4, భూసమస్యలు – 9 , రైస్ కార్డులు – 3, పంచాయితీ రాజ్ నుంచి 1 మొత్తం 37 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జయశంకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడిపల్లిలో..

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి రెవెన్యూ గ్రామంలో శుక్రవారం ఉదయం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్‌కు 9, పెన్షన్‌కు 6, ఇంటి పట్టాలకు 5, రేషన్‌కార్డుల కోసం రెండు, సర్వే కోసం 4, మ్యుటేషన్ కోసం 3 చొప్పున అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కుమార్ స్వామి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజునాథ్, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు గంగాధర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పెనుకొండ రూరల్:ఫిర్యాదులు స్వీకరిస్తున్న మంత్రి సవిత



లేపాక్షి: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుదర్శన్

భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు

రొళ్ల: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం ఎం.రాయాపురం సచివాలయం ఆవరణలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పట్టదారు పాసుపుస్తకంలో పేర్ల మార్పు, సబ్ డివిజన్ ఇతరాత్ర సమస్యలు ఉంటే పరిష్కరించుకోవచ్చన్నారు. ఈసందర్భంగా భూ సమస్యలపై 12, హౌసింగ్ 14, ఇతరాత్ర వాటి కోసం ఒక అర్జీ వచ్చినట్లు ఆయన తెలిపారు. వీఆర్వో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి బాబురావు పాల్గొన్నారు.

గుడిబండ: రాళ్లపల్లిలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అధికారులు భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ గ్రామసభలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌ఐ మహమ్మద్‌బిలాల్, సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: భూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి నరసింహమూర్తి, తహసీల్దార్ మారుతిప్రకాష్ తెలిపారు. శుక్రవారం వలస పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ రైతులు తమ భూముల సమస్యలుంటే ఆధారాలతో సహ వినతి పత్రాన్ని సమర్పించాలని కోరారు. ఈ సందర్భంగా 13 మంది రైతులు అర్జీల అందజేశారు.

అగళి: ఆలూడిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామసభకు 5 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. వీటీని వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఆర్‌ఐ చంద్రశేఖర్, వీఆర్‌ఓ నరసింహమూర్తి, సర్వేయర్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై గ్రామసభ

మడకశిరరూరల్: ఆమిదాలగొంది గ్రామ సచివాలయంలో శుక్రవారం భూ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలున్న వారు అధికారులకు అర్జీలు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కరుణాకర్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రీ సర్వే ద్వారా వచ్చిన భూ సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: ఆర్ అనంతపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈమేరకు ఏఈ విశ్వనాథ్ శుక్రవారం ఓప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

పెనుకొండ రూరల్: గుట్టూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం , కోనాపురం, కొండాపురం, చెర్లోపల్లి, శెట్టిపల్లి, మరువపల్లి, కురువాండ్లపల్లి పంచాయతీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రొళ్ల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఏఈ నిజాముద్దీన్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రొళ్ల, హొట్టేబెట్ట, హులికుంట, గుడ్డగుర్కి, రత్నగిరి, కాకి, దొడ్డేరి పంచాయతీల్లోని ప్రజలు గమనించాలని కోరారు.